బ్రతికి ఉండడానికి పెర్మిషను

కోసం అర్జి దాఖలు-మరి మంజూరో?

# ★ హామీ లేని జీవితం ★

చింతా శ్రీరామచంద్రమూర్తి

దేశం చాలా మారింది అనుకుంటూ పడక్కుర్చీలో నడుం వాల్చిన విశ్వనాథంగారు చుట్ట నోట్లో పెట్టారు. ఆయన ఎప్పుడు చుట్ట నోట్లో పెట్టినా, చచ్చిపోయిన వెనకటి ఆంధ్ర పౌరుషం పుట్టిపడేలాగ ఎడంపక్కనించి పొగ వదలడం అలవాటైన విషయం.

ఆయనకు చుట్ట కాల్చడం చాలా తప్పని తెలుసు. ఈ పొగ వెళ్లి గుండెకాయనీ, వూపిరితిత్తుల్నీ అవలీలగా మారించివేస్తుందని ఎన్ని పుస్తకాల్లో చదవలేదు? అయినా...

చచ్చిన ఆంధ్ర పౌరుషం జ్ఞాపకానికి రావద్దూ!

విశ్వనాథంగారికి ఆంధ్ర పౌరుషం ఎప్పుడెప్పుడెల్లా చచ్చిందీ బాగా తెలుసు. తను ఎం. ఏ. ప్యాసయిన దగ్గరనించీ, అంటే రమారమీ ఏడు సంవత్సరాలనించి అసలు పూర్తిగా ప్రాణం లేకుండా తయారయిందని ఆయన పరీక్ష మీద నిర్ధారణ చేసుకున్నాడు. అప్పట్నించే యీ చుట్టల ఖర్చు.

అయితే చుట్టలు కాల్చి ఆంధ్రత్వాన్ని వెలగబెట్టాలని ఆయన ఆశ కాదు. ఎమ్. ఏ. ప్యాసయ్యాడు కదా మరి. ఇంటి దగ్గర ఏ పనీ లేకుండా ఎల్లా కూర్చోగలడు? అందుకనే చుట్టలతో కబుర్లు చెపుతూ, ఆ అరుగు అరిగిపోయేలాగ అక్కడే కూర్చోడం అలవాటు చేసుకున్నాడు. దీనివల్ల రోజుకో పావలా సాద రాతుంది ఆయనకు. కర్చయితే అయింది గాని, ఆయనకు జీవితంమీద నిరాశ లేకుండా బ్రతికిస్తున్నాయి. ఆ చుట్టలే లేకపోతే ఆయన యీపాటికి ఏంకో లోకంలోకి వెళ్లవలసినవాడే బెంగతో కృశించి. మానవునికి హృదయమిచ్చి ఆనందాన్ని చేకూర్చే మనుషులు లేకపోయినా ప్రాణరహిత పదార్థాలేనా ప్రపంచంలో వున్నందుకు సంతోషిస్తున్నాను నేను.

పొగ వదుల్తూ లోకంవైపు మగతగా దృష్టి సారించి, యిదేం లోకం అనుకుంటున్నాడు విశ్వనాథంగారు. ఈ లోకంపేరు ఆ సందర్భంలో ఎందుకు మరచిపోయాడో నాకూ అనూహ్యం.

ఇంతల్లోకి ఒక మహా వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు అక్కడికి. చిరిగిన ఖద్దరులాల్చీ, అంచులేని గూడకట్టూ, వంగిపోయిన కాలూ, వంగని చెయ్యీ వేసుకుని.

'ఏం మహాత్మా. ఇదేం లోకమంటారు?' అన్నాడు విశ్వనాథంగారు.

'చిత్రం భూలోకం' అన్నాడు ఆ వ్యక్తి.

'ఎల్లా అనుకుంటున్నారు భూలోకమని' అన్నాడు విశ్వనాథంగారు.

'భూగోళంలో అల్లా రాసివుంది' అన్నాడు ఆగంతకుడు.

'ఇంకా ఏమైనా నిదర్శనాలు' అన్నాడు విశ్వనాథంగారు.

'చాలామంది అల్లా అనుకుంటారు' అన్నాడు ఆ మనిషి.

'చాలామంది అనుకున్నంత మాత్రాన ఏ మాటేనా సత్యమంటారా' అన్నాడు విశ్వనాథంగారు.

'మరి ఏం చెయ్యను' అన్నాడు అపరిచితుడు.

'అనుకోడం మానెయ్యండి' అన్నాడు విశ్వనాథంగారు.

'మరి మనం వుండేది ఏంలోకమంటారు' అన్నాడు అవతల మనిషి.

'ఏదో యింకోటి అనుకోలేరూ!' అన్నాడు విశ్వనాథంగారు.

'స్వర్గమనుకుంటాను' అన్నాడు ఆ వ్యక్తి.

'అల్లాగే కానియ్యండి. తమరు స్వర్గంనించి యిప్పుడిల్లా ఎందుకు దయచేశారు' అన్నాడు విశ్వనాథంగారు.

'కాస్త తమ దర్శనం చేసుకుందామని' అన్నాడు ఆగంతకుడు.

'సరే దర్శనం అయింది కనక సెలవు తీసుకోండి' అన్నాడు ఎమ్. ఏ.

'తమరు అలా సెలవిస్తే మాలాంటి వాళ్లు బ్రతికేది ఎల్లాగ' అన్నాడు అపరిచితుడు.

'మీ లాంటి వాళ్లకి యీ భూమ్మీద చావు లేకపోవడం వల్లనే స్వర్గమన్నారనుకుంటాను' అన్నాడు విశ్వనాథంగారు.

'అల్లాకాదు బాబూ. మీలాంటి ప్రభువులు నిత్యమూ సుఖిస్తూ యీ భూలోకాన్ని స్వర్గంగా మారుస్తున్నారు. అందువల్ల...... అన్నాడు ఆగంతకుడు.

'కవిత్వం మాటాడుతున్నారే' అన్నాడు పోస్టుగ్రాడ్యుయేటు.

'మాట్లాడ్డమే కాదు. చాలా ప్రేమగ్రంథాలు రాసినవాణ్ని' అపరిచితుడు గర్వపడ్డాడు.

'అచ్చుకిచ్చారా' అన్నాడు తిని కూర్చునే ఆసామీ.

'తినడానికే తిండిలేక పోతుంటే గ్రంథాలు అచ్చు ఎల్లా అవుతాయి. అయినప్పటికీ అది కూడా యాచనలో ఒక భాగంగా పెట్టాను' అన్నాడు ఆగంతకుడు.

'మీ జీవితం వెనకాల చాలా గ్రంథం వున్నట్టుంది' అన్నాడు ఎమ్. ఏ.

'అనంతమైంది. నా తలితండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. మేం ముగ్గురం అన్నదమ్ములము. ఒకడు మూగివాడు. రెండవవాడు గుడ్డివాడు. మూడవవాణ్ని నేను. నేను యింగ్లీషు చదువుకున్నాను. హైస్కూలు వదలిపెట్టాక గవర్నమెంటు వుద్యోగం దొరికింది. రెండు సంవత్సరాలు అందులోనే పనిచేశాను. ఇంతలోకే యీ గ్రహస్థితి వచ్చింది. లేకపోతే యీ పాటికి పై వుద్యోగంలోకి పోయేవాణ్ని' అన్నాడు ఆగంతకుడు.

'ఏం గ్రహస్థితి' అన్నాడు ఎమ్. ఏ.

'పక్షవాతం వచ్చి ఒక కాలూ, ఒక చెయ్యీ అడ్డదిడ్డంగా పడిపోయాయి. పోనీ అని ప్రభుత్వం జాలైనా దలచక ఉద్యోగంలోంచి పొమ్మంది. లేకపోతే మీ దగ్గరకు వచ్చి యాచించవలసిన జీవితం కాదు నాది' అన్నాడు ఆయన.

'అయితే నేనో కవిషయం చెపుతా వింటారా' అన్నాడు విశ్వనాథంగారు.

'చిత్తం. చిత్తం' అన్నాడు ఆగంతకుడు.

'మీరు వచ్చి యాచిస్తే పొమ్మనవలసిన జీవితం కాదు నాది. కాని ప్రస్తుతం మీరు నాకంటె గొప్పస్థితిలో వున్నారు. కారణం మీ కులం గొప్పది. హైస్కూలు చదువు చదివినంత మాత్రాన మీకు ఉద్యోగం లభించడం, దాన్ని నిర్వహించడం జరిగింది. అప్పుడూ మీరు సుఖాన్ని పొందారు. దరిమిలాను మీరు పెద్ద ఉద్యోగంలోకి వెళ్లడమూ అప్రయత్నంగానే జరిగింది. కాలూ, చెయ్యీ పడిపోవడం వల్ల నలుగురూ నాలుగు కాసులేనా వేస్తారు. మీ బ్రతుక్కి సాంఘిక జీవితంలో ప్రజల సెహ్యారిటీయేనా వుంది.

'కాని నా విషయానికి వస్తే చదువు పెద్దదే అయినా నాకేసి చూసేవాళ్లు లేరు. ఉద్యోగానికి నా కులం పనికి రాదనడంవల్ల నాకు ఉద్యోగం రాకుండా పోయింది. మా తమ్ముడిలా బస్సు కండక్టరు పని చెయ్యడానికి యీ నా చదువే అడ్డు మొస్తుంది. అయ్యబాబో ఎమ్. ఏ. అంటున్నారు. ఇటు ప్రభుత్వమూ అటు ప్రజలూ కూడా నన్ను చూసి జాలి దలచరు. నా జీవితానికి హామీ లేదు. ఎక్కడికి వెళ్ళినా నేను మారను. నాకూ కూడా కాలూ చెయ్యీ పడిపోతే మీ వెనకే వద్దును' అన్నాడు విశ్వనాథంగారు.

'సరి సరి. ఏమిటో అనుకున్నాను. క్షమించండి. ఇది యమలోకం' అంటూ ఆగంతకుడు ఎక్కడికో వెళ్ళిపోయాడు.

నేను అంధ్రుణ్నికదా అనుకుంటూ ఉద్యోగం లేని విశ్వనాథంగారు చుట్టనార్పేశాడు, చదువుకునే ప్రయివేటు కుర్రాళ్లు రావడంవల్ల.